క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు అశోక్


ప్రధాన కార్యదర్శి రవి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పోత రాజు అశోక్, ప్రధాన కార్యదర్శిగా తోట రవి, ఉపాధ్యక్షులుగా మదన్, నవీన్, సహాయ కార్య దర్శులుగా మోహన్, శ్రీకాంత్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులుగా కృష్ణ, సుధాకర్, వెంకటేశ్వర్‌రావు, కుమారస్వామి తోపాటు సలహాదార్లను, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని గ్రామస్తులు అభినందించారు.

వివాహిత అదృశ్యం


రూన్సీ (ఫైల్)

నర్సంపేట రూరల్ : వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని చెరువు కొమ్ము తండా శివారు వాంకుడోతుతండాలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజేశ్‌రెడ్డి కథనం ప్రకారం.. వాంకుడోతుతండాలో చెందిన బోడ రూన్సీకి, ఆమె భర్త జవహర్‌లాల్‌కు ఈనెల 2న గొడవ జరిగింది. అదే రోజు రాత్రి రూన్సీ ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వారి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త జవహర్‌లాల్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశాలపల్లిలో..


రాజేశ్వరి (ఫైల్)

సంగెం : మండలంలోని ఆశాలపల్లికి చెందిన కూచన రాజేశ్వరి, కుమారస్వామి దంపతులకు సుమారు 40 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలుండగా వారికి పెళ్లి అయ్యింది. కొంతకాలంగా కుమారస్వామికి ఆరోగ్యం బాగుండడం లేదు. ఈ క్రమంలో వైద్య కోసం వారికి ఉన్న 35 గుంటల భూమి అమ్మడానికి కుమారస్వామి నిర్ణయించుకోగా ఆ విషయమై ఈనెల 2న దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజేశ్వరి శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెదికినా జాడ దొరకలేదు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సెల్ నంబర్ 8712685029, 8712685243కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ వాటర్ మెన్ కమ్ ఎలక్ట్రిషన్ వడ్డె కుమారస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. తొలుత కుమారస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, రైతుబంధు మాజీ జిల్లా సభ్యుడు చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు యాదవ్, నాయకులు రంగు కుమార్ గౌడ్, చింతపట్ల సునీల్‌రావు, ఇస్లావత్ హరీశ్, సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా తండా పంచాయతీల రిజర్వేషన్లు



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రిజర్వేషన్లు తప్పుల తడకగా ఉన్నాయని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు ధ్వజమెత్తారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తండాలను గ్రామపంచాయతీలుగా సాధించుకోగా ప్రస్తుత ఎన్నికల షెడ్యూల్ గిరిజనులకు నష్టం కలిగించేలా ఉందన్నారు. పంచాయతీలుగా ఉన్నతీకరించబడిన తండాల్లో బీసీ, ఎస్సీ రిజర్వేషన్ ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. లంబాడీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని మండిపడ్డారు. తక్షణమే ఎన్నికల షెడ్యూల్‌లో తండా పంచాయతీలకు ఎస్టీ రిజర్వేషన్లు తప్పనిసరి చేస్తూ సవరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, భోజ్యా, యాకూబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.


పర్వతగిరి : జమ్మి పూజ చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, తదితరులు



దుగ్గొండి : ఆయుధ పూజ చేస్తున్న సీఐ సాయిరమణ, ఎస్సై రణధీర్‌రెడ్డి


సంగెం : గవిచర్లలో రావణాసుర వధ

వైభవంగా విజయదశమి వేడుకలు

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, దుగ్గొండి, పర్వతగిరి, నెక్కొండ, సంగెం, గీసుకొండ, ఖానాపురం, నల్లబెల్లి, చెన్నారావుపేట, రాయపర్తి మండలాల్లో విజయదశమి వేడుకలను ప్రజలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయాల్లో శమీ పూజలు వేడుకగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఆయుధ పూజ చేశారు. జనసందోహం నడుమ రావణాసుర వధ నిర్వహించారు. పలు చోట్ల జమ్మి చెట్టును ప్రజలు పూజించారు. పాలపిట్టను చూసి సంబరపడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

-సాక్షి నెట్‌వర్క్


ఖానాపురం : ఆయుధ పూజ చేస్తున్న ఎస్సై రఘుపతి


రాయపర్తి : వెంకటేశ్వరపల్లిలో జమ్మి పూజ చేస్తున్న ప్రజలు


నెక్కొండ : ఆయుధ పూజ చేస్తున్న సీఐ, ఎస్సై


సంగెం : గవిచర్లలో పూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నర్సంపేట రూరల్ : దసరా వేడుకలు నిర్వహిస్తున్న గ్రామపెద్దలు

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


నెక్కొండ : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


నర్సంపేట రూరల్ : ఊరేగిస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. భక్తులు ఉదయం నుంచే భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, నెక్కొండ, తదితర మండలాల్లో దుర్గాదేవిని డీజే, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. పలు చోట్ల మహిళలు మంగళహారతులతో శోభాయాత్రకు స్వాగతం పలికారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.


దుగ్గొండిలో..

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ఖానాపురం : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని ఐనపల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గుగులోతు లక్ష్మణ్ నాయక్‌తోపాటు కొత్తూరుకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి సుదర్శన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతోపాటు ప్రజలను మోసం చేస్తోందని తెలిపారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, నాయకులు వల్లెపు శ్రీనివాస్, బాధావత్ బాలకిషన్, తేజావత్ బాలునాయక్, సదర్‌లాల్, పూల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణ్‌నాయక్‌కు కండువా కప్పుతున్న పెద్ది

ఊరూరా గాంధీ జయంతి


దుగ్గొండి : నాచినపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌రెడ్డి

నర్సంపేట రూరల్/దుగ్గొండి/ఖానాపురం/పర్వతగిరి : చెన్నారావుపేట, దుగ్గొండి, పర్వతగిరి, ఖానాపురంమండలాల్లో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ పాత్రను నాయకులు కొనియాడారు.


ఖానాపురం : బుధరావుపేటలో..


పర్వతగిరి : గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాజ్‌వే కష్టాలు తీరేదెన్నడో?

● వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు

సంగెం : మండల పరిధిలోని ప్రధాన రహదారుల్లోని లోలెవల్ కాజ్‌వేల వల్ల ఎదురౌతున్న కష్టాలు తీరేదెన్నడో? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల క్రితం నాటి పరిస్థితులకు అనుగుణంగా ఆర్ అండ్ బీ, పీఆర్ రోడ్ల వెంట పలు ప్రాంతాల్లో లోలెవల్ కాజ్‌వేల నిర్మాణాలు చేపట్టగా తదనంతరం అవసరమైన మేరకు బ్రిడ్జిల నిర్మాణం, ఇతర పనులు చేపట్టకపోవడంతో ఏటా వర్షాకాలం వచ్చిందంటే రోజుల తరబడి వరదలతో ఇబ్బందులు తప్పని దుస్థితి నెలకొంది. వర్షం కురిస్తే వరద ఉధృతికి రాకపోకలు స్తంభించడం పరిపాటిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తూ తదనంతరం పట్టించుకోరన్న అపవాదు మూటగట్టుకున్నారు. మండలంలోని కాట్రపల్లి చెరువు మత్తడి వరద ప్రవహించే లోలెవల్ కాజ్‌వే ఏటా కొట్టుకుపోవడం, అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం షరా మామూలే అయ్యింది. కాట్రపల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్యలోని కాజ్‌వే కొట్టుకుపోవడంతో నెలల తరబడి కొత్తగూడెం ఆర్టీసీ బస్సు నిలిచిపోయి విద్యార్థులు, రైతులు, వ్యాపారస్తులు ఇబ్బంది పడుతున్నారు.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే

కాట్రపల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్యలోని కాజ్‌వే వరదలో 2007 సంవత్సరంలో గీసగోని భాగ్యమ్మ అనే మహిళా రైతు వరి కలుపు తీయడానికి వెళ్లి వస్తున్న క్రమంలో కొట్టుకుపోగా ఓ బాలుడు సాహసం చేసి రక్షించాడు. నాటి నుంచి వరదలు వచ్చినప్పుడల్లా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. 2021–22 సంవత్సరంలో నాటి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.41 కోట్లు మంజూరు చేసింది. అయినా పనులు చేపట్టలేదు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆర్టీసీ బస్సు రాకపోకలు నిలిచిపోయాయి.


వరద ఉధృతికి కొట్టుకుపోయిన కాట్రపల్లి-వెంకటాపూర్ మధ్యలోని కాజ్‌వే (ఫైల్)

వర్షాకాలం ప్రమాదకరం

వర్షాకాలం వచ్చిందంటే పలు లోలెవల్ కాజ్‌వేలు పొంగిపొర్లుతూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. సంగెంలోని పెద్దవాగు బ్రిడ్జి సమీపంలోని లోలెవల్ కాజ్‌వే, చింతలపల్లి–పల్లారుగూడ మధ్యలోని లోలెవల్ కాజ్‌వే, పల్లారుగూడ–మచ్చాపూర్ మధ్యలోని లోలెవల్ కాజ్‌వే, తిమ్మాపూర్–ఎల్గూర్ స్టేషన్ మధ్యలోని కాజ్‌వేల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎల్గూర్ రంగంపేట చెరువు మత్తడి–బ్రిడ్జి నెలల తరబడి నీటి ప్రవాహం ఉండి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇకనైనా కాజ్‌వేలపై బ్రిడ్జిలు నిర్మించి వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


పెద్దవాగు సమీపంలో నిలిచిన రాకపోకలు (ఫైల్)

బ్రిడ్జిలు నిర్మించాల్సిందే

కాట్రపల్లి–వెంకటాపూర్ మధ్యలోని బ్రిడ్జి ఏటా వానాకాలం కొట్టుకుపోతోంది. చెరువు మత్తడి వరదతో రోడ్డు కొట్టుకుపోయి ధ్వంసమైంది. రాళ్లుతేలడంతో ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. కాట్రపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. కాజ్‌వేల వద్ద హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాల్సిందే.

- మిల్కూరి అభిలాశ్‌రెడ్డి, కాట్రపల్లి

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని కాట్రపల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్యలోని కాజ్‌వేపై బ్రిడ్జి, ఎల్గూర్ రంగంపేట చెరువు మత్తడి–రోడ్డుతోపాటు పలు కాజ్‌వేలపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపించాము. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు చేపడతాము.

- అభిరామ్, ఏఈ, పీఆర్ శాఖ

నివాళి

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని ఈర్యతండాకు చెందిన ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ సభ్యుడు గుగులోతు భద్రు కుమారుడు రాజ్‌కుమార్ కుక్కకాటుకు గురై శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని మృతదేహానికి ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు గౌడిశాల మల్లయ్య, నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని మల్లయ్య, నాయకులు పరామర్శించారు. రాజ్‌కుమార్ మృతి బాధాకరమని తెలిపారు. రాజ్‌కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, సదయ్య, అనిల్, రవి, కరుణాకర్, ఇంద్రయ్య, రాజు, ప్రవీణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండల కేంద్రంలోని జాగృతి హైస్కూల్‌లో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం 25 ఏళ్లు గడచిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ పేరుతో ఆత్మీయ సమ్మేళనం వేడుకగా నిర్వహించారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులను పేరుపేరునా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, ఉపాధ్యాయులు విజయ్, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, ప్రకాశ్, భిక్షపతి, హరిప్రసాద్, పూర్వ విద్యార్థులు కాసుల రవికుమార్, బాలకృష్ణ, రాజేశ్, రవి, అశోక్, కరుణాకర్, రాధిక, కవిత, కోరె దేవేంద్ర, చెవ్వ దేవేంద్ర, రజిత, భవానీ తదితరులు పాల్గొన్నారు.


తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కంఠమహేశ్వరుడి వేడుకలను విజయవంతం చేయాలి

నర్సంపేట : పట్టణంలోని కంఠమహేశ్వర ఆలయంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి, శ్రీరేణుక ఎల్లమ్మతల్లి, జమదగ్ని పండుగ వేడుకలను విజయవంతం చేయాలని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామగోని సుధాకర్ కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ గౌడ సంఘం సభ్యులను శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా గీత కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు ఐక్యతతో వేడుకలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, నాయకులు గిరగాని శ్రీనివాస్, కొయ్యడి సనత్, విలాసాగరపు నరేందర్, గండి లింగయ్య, దూపటి మనోహర్, వేముల సాంబయ్య, ఊడ్గుల శ్రీనివాస్, పుల్లూరి శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి మద్దెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.